తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక
విలేకరులు కావలెను
పత్రిక రంగంలో మరో సంచలనం, వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో పని చేయుటకు
జిల్లా బ్యూరో చీఫ్ లు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు,
జిల్లా క్రైమ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించగలరు
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత,
కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.
ఈ క్రింది నెంబర్ల ను ఫోన్ ద్వారా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించగలరు
9177108128, 9966847463

# తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక
teenmaardesk@gmail.com

for e-paper scan now

ములుగు | సంపుటి : 02 | సంచిక : 280 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 22 జనవరి 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.




## ప్రక్షాళన దిశగా బీఆర్ఎస్

కోటరీని పూర్తిగా పక్కకు తప్పిస్తారా?
ఉద్యమకారులను ముందుకు తెస్తారా?
యువ నాయకత్వంతో పార్టీకి కొత్త ఉత్తేజం
రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చలు

### నాయకత్వ స్థానాల్లోకి కొత్త వారికి అవకాశం!

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుందంటూ తెలంగాణ సంక్షేమ, అభివృద్ధి పథకాలే దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయని గొప్పగా ప్రచారం చేసినా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆరెస్ ఓటమిపాలైంది. దీనిపై అంతర్మథనం చెందుతున్న గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ పార్టీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని భావిస్తున్నారు. ఇదే అంశాన్ని బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ ఎమ్మెల్సీల భేటీలో వెల్లడించడం పార్టీ వర్గాల్లో ఆసక్తికరంగా

మిగతా 2 లో

## ప్రపంచ స్థాయి డిజైనర్లు, ఆర్కిటెక్ట్‌లతో సీఎం రేవంత్ భేటీ

మూసీ రివర్ ఫ్రంట్‌పై కీలక సమావేశం



2

## అధికారిక ఆహ్వానం అందలేదు కాబట్టే అయోధ్యకు వెళ్లలేము

అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్టపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు



2

## రాష్ట్ర సలహాదారులను ప్రకటించిన ప్రభుత్వం

### వేంనరేందర్ రెడ్డి, షబ్బీర్ ఆలీ, హరకర వేణుగోపాల్ లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ సలహాదారులను నియమించింది తెలంగాణ ప్రభుత్వం. వేంనరేందర్ రెడ్డి, షబ్బీర్ ఆలీ, హరకర వేణుగోపాల్ ను సలహాదారులుగా ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్‌తో వేంనరేందర్ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీలో ఇద్దరూ కలిసి పని చేశారు. 2004-2009 మధ్యలో వేం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా పనిచేశారు. 2007లో ఎమ్మెల్సీగా రేవంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. అప్పట్నుంచే ఇద్దరి మధ్య స్నేహం బలపడుతూ వచ్చింది. వేం నరేందర్ ను 2015లో ఎమ్మెల్సీగా గెలిపించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నించారు. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. అనంతర కాలంలో రేవంత్ రెడ్డి వెంటే ఉన్నారు నరేందర్ రెడ్డి. ఆ తర్వాత రేవంత్ రెడ్డితో పాటే కాంగ్రెస్ లో చేరారు. అప్పటి నుంచీ పలు కార్యక్రమాల్లో వేం నరేందర్ క్రియాశీలకంగా ఉంటున్నారు. ఇటీవలి ఎన్నికల సమయంలోనూ పీసీసీ అధ్యక్షుడి ప్రచారంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో వేం నరేందర్ కు ఛాన్స్ దక్కింది. ఇకపై ఆయన సీఎం రేవంత్ సలహాదారుడిగా

మిగతా 2 లో



## ఈ నెల 26 తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటన

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే లోక్‌సభ ఎన్నికలు వస్తున్నాయి. దాంతో ఆ పార్టీ మరోసారి లోక్‌సభ ఎన్నికల్లో కూడా తమ సత్తా చూపించాలని భావిస్తోంది. రాష్ట్రంలో ఎక్కువ లోక్‌సభా స్థానాలను గెలవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎన్నికల కమిటీతో పాటు జిల్లాల ఇంచార్జులను కూడా నియమించింది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే గట్టిగా కష్టపడి

మిగతా 2 లో

## కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఘాటు వ్యాఖ్యలు

మోదీ మళ్ళీ ప్రధాని అయితే కాంగ్రెస్‌కు పండగే : మల్లారెడ్డి



2

## డా. బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

2

## కేసీఆర్ అనే మహాశక్తిని ఎదిరించడానికి బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటి అయ్యాయి

బీఆర్ఎస్ ని రాష్ట్రంలో తుడిచిపెట్టేందుకు ఇరు చేతులు కలిపాయి
సోషల్ మీడియాలో వేదికగా వైరల్ అవుతున్న కేటీఆర్ కామెంట్స్



2 లో..

## బీఆర్ఎస్ కు ఇది పరీక్షా సమయం.. భవిష్యత్ లేదని కుంగిపోవద్దు

విజయాలతో పాటు అపజయాలు ఉన్నాయి
బీఆర్ఎస్ కార్యకర్తలతో హరీశ్‌రావు సమావేశం



2 లో..

# ప్రక్షాళన దిశగా బీఆర్ఎస్

**మొదటి పేజీ తరువాయి**

మారింది. పార్టీని గ్రామస్థాయి నుంచి పొలిట్ బ్యూరో వరకు పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలన్న ఆలోచనతో కేసీఆర్ ఉన్నారని కేటీఆర్ వెల్లడించారు. అంటే తుంటి ఆపరేషన్ నుంచి ఒకవైపు తాను కోలుకునే ప్రయత్నాలు చేస్తూనే ఇంకోవైపు పార్టీని తిరిగి బలోపేతం చేసి, రానున్న లోక్‌సభ సహా స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి సన్నద్ధం చేసే దిశగా కేసీఆర్ మేధోమథనం చేస్తున్నారని కేటీఆర్ మాటల్లోనే అవగతమవుతున్నది. అంతేగాక ఇటీవల లోక్‌సభ సన్నాహక సమావేశాల్లో ఇక నుంచి బీఆరెస్‌లో ఎమ్మెల్యే కేంద్రంగా పార్టీ కాకుండా పార్టీ కేంద్రంగానే ఎమ్మెల్యేలు పనిచేసే విధానం తీసుకొస్తామని కేటీఆర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆరెస్‌లో సంస్థాగతంగా భారీ మార్పులకు కేసీఆర్ సిద్ధపడుతున్నారని గులాబీ పార్టీలో చర్చ సాగుతున్నది. అయితే అధినేత కేసీఆర్ మొదలుకుని వ్యక్తి పూజ మయమై, ఎమ్మెల్యేలు కేంద్రంగా సాగిన బీఆరెస్ పార్టీలో సంస్థాగత మార్పులు ఒక్కసారిగా జరిగే పనేనా అన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తున్నది.

**అధ్యక్షులు నామామాత్రం..**

ఎమ్మెల్యేలు కేంద్రంగా వ్యవహారాలు అధికారంలో ఉన్నన్నినాళ్లు పార్టీ నిర్మాణంపై అధినేత కేసీఆర్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ పెద్దగా దృష్టి సారించలేదనే అభిప్రాయాలు ఉన్నాయి. అయితే.. పాలనపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించడం వల్ల పార్టీకి సమయం ఇవ్వలేక పోయామని కేటీఆర్ సైతం లోక్‌సభ సన్నాహక సమావేశాల్లో అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏ పార్టీకి అయినా కీలకమైన సంస్థాగత నిర్మాణంపై ఓటమి తర్వాతనైనా బీఆరెస్ నాయకత్వం దృష్టి సారించడం కీలకమైన దిద్దుబాటు చర్యే అవుతుందని, ప్రత్యేకించి గ్రామస్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకూ ప్రక్షాళన చేయడం ఆ పార్టీకి కొత్త జవసత్వాలు అందిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బీఆరెస్‌కు జిల్లాల పార్టీ అధ్యక్షులు, మండల, గ్రామశాఖల అధ్యక్షులున్నా నామమాత్రమేననే అభిప్రాయాలు పార్టీ వర్గాల్లోనే ఉన్నాయి. కార్యవర్గాల ఏర్పాటు కాగితాలకే తప్ప కార్యవర్గాల సమావేశాలు నిర్వహించే సంస్కృతి ఏనాడో మరిచిపోయారు. క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా వ్యవహరించడంతో వారిదే రాజ్యమన్నట్టు సాగిందని పలువురు కార్యకర్తలు చెబుతున్నారు. దీంతో క్యాడర్‌కు, లీడర్‌కు దూరం పెరిగిపోయిందని అంటున్నారు. కార్యకర్తల కష్టాలు ఏమిటో తెలియకుండా పార్టీ వ్యవహారాలు నడిచాయని చెబుతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు కేసీఆర్‌ను కలువడం కంటే బీఆరెస్‌లో ఎమ్మెల్యేలను కార్యకర్తలు కలవడం అంతకంటే ఎక్కువ కష్టమన్న భావన కార్యకర్తల్లో వినిపించడం అప్పట్లో సర్వసాధారణంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. గ్రామస్థాయి, మండల స్థాయి నాయకులు కేసీఆర్, కేటీఆర్‌లను కలవడం కలలో మాటగానే మారింది. దీంతో సిటింగ్‌లపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందన్న సంగతి క్యాడర్ ద్వారా అధిష్ఠానానికి చేరలేకపోయిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అదీగాక జనం ఓట్లేసేది ఎమ్మెల్యే అభ్యర్థులను చూసి కాదు.. కేసీఆర్‌ను చూసే.. అనే అతి విశ్వాసం సిటింగ్‌లనే మళ్లీ బరిలోకి దింపేలా చేసిందని, అప్పటికే బీఆరెస్ పాలన, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఏకపక్ష పోకడలకు మళ్లీ సిటింగ్‌లే నిలబడటం జనం మెచ్చలేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయం కార్యకర్తల ద్వారా పైస్థాయి నాయకత్వానికి, తద్వారా అధిష్ఠానానికి తెలియకుండా పోయిందని చెబుతున్నారు.

**మేళాలుగా మిగిలిన ఆత్మీయ సమ్మేళనాలు!**

ఎన్నికలకు ముందు మండలాలు, నియోజకవర్గాలవారీగా పార్టీ కార్యకర్తలతో భారీగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సమావేశాలు మేళాలను తలపించాయి. సమావేశాలకు పార్టీ సంస్థాగత సైద్ధాంతిక వాదానికి కట్టుబడే నిజమైన కార్యకర్తలు కాకుండా గ్రామాల నుంచి బహిరంగ సభలకు జనసమీకరణ చేసినట్లుగా సాధారణ జనాన్ని కూడా తరలించేసి తమ సమావేశాలు విజయవంతమైనట్లుగా భావించారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సమ్మేళనాల్లోనైనా పార్టీ క్యాడర్ అభిప్రాయాలు విన్నారా అంటే అదీ లేదని, కేవలం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీల ఉపన్యాసాలు విని వెళ్లిపోతే చాలనే విధంగా అవి సాగాయని గుర్తు చేస్తున్నారు. సరిగ్గా ఎన్నికల తర్వాత ఇప్పుడు తెలంగాణ భవన్ వేదికగా లోక్‌సభ నియోజకవర్గాల సన్నాహక సమావేశాలు సైతం అదే రీతిలో కేటీఆర్, హరీశ్‌రావు సహా రాష్ట్ర నేతల ఉపన్యాసాల వేదికలుగా మారిపోయాయని పరిశీలకులు అంటున్నారు. కార్యకర్తలు, గ్రామ, మండల నాయకుల అభిప్రాయాలు చాటే అవకాశం వీటిలో కనిపించడం లేదని చెబుతున్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ అధిష్ఠానానికి చేరడం ఇప్పటికీ లేకుండా పోయిందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీని ఎలా పునర్వ్యవస్థీకరిస్తారు? మార్పులు, చేర్పులు ఏ విధంగా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

**కోటరీని తొలగిస్తేనే కొత్త ఆలోచనలకు అవకాశం!**

బీఆరెస్ పాలనపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను ఉన్నవి ఉన్నట్టుగా చెప్పడంలో ఆయన చుట్టూ ఉండే కోటరీ విఫలమైందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పాజిటివ్ తప్పించి నెగెటివ్‌ను ఆలకించని కేసీఆర్ మనస్తత్వం కూడా కోటరీ నుంచి తీపి మాటలు పలికించేందుకు కారణమై ఉంటుందనే అభిప్రాయాలను కూడా వారు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఈ కోటరీ పరిస్థితి ఏంటనే చర్చ కూడా పార్టీ వర్గాల్లో అక్కడక్కడ వినిపిస్తున్నది. వీరిని దూరం పెడితే తప్ప క్షేత్రస్థాయిలో క్యాడర్ అభిప్రాయాలు పార్టీ పెద్దలకు తెలిసే అవకాశాలు ఉండవని బీఆరెస్ వర్గాలు అంటున్నాయి. అయితే.. ఇదే దిశగా కేసీఆర్ ఆలోచన చేస్తున్నారనేది తెలంగాణ భవన్ వర్గాల కథనం. కేసీఆర్, కేటీఆర్ సభల్లోనూ, బీఆరెస్ ముఖ్య కార్యక్రమాల్లోనూ, మీడియా సమావేశాల్లో, చర్చా వేదికల్లోనూ ఎక్కడా చూసినా వేళ్ల మీద లెక్కబెట్టగలిగే కొందరు నాయకులే ఎక్కువగా కనిపించేవారు. వారిలో ఇద్దరు ముగ్గురు మినహా మిగతా వారంతా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. వారిని దూరం పెడితేనే మంచిదన్న భావన కార్యకర్తల్లో వినిపిస్తున్నది. వారి స్థానంలో యువ నాయకత్వానికి, తొలిసారిగా గెలిచిన వారికి అవకాశాలు కల్పిస్తే పార్టీకి మేలు జరుగవచ్చని అంటున్నారు. మరీ ముఖ్యంగా కేసీఆర్, కేటీఆర్‌లు తమపై తాము పెంచుకున్న అతి విశ్వాసాన్ని దూరం చేసుకోవడంతోపాటు తమ చుట్టూ ఉండే కోటరీని క్రమంగా దూరం పెట్టకపోతే ఎంత పునర్వ్యవస్థీకరణ చేసినా పరిస్థితిలో మార్పు ఉండదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పదేళ్ల అధికారం అడ్డుపెట్టుకుని ల్యాండ్స్.. సాండ్స్.. మైన్స్.. వైన్స్ వంటి వాటితో సహా ప్రభుత్వ శాఖలలో అవినీతికి పాల్పడిన మాజీ ఎమ్మెల్యేలను పార్టీ వ్యవహారాల్లో దూరంగా ఉంచితేనే ప్రజల్లో పార్టీ నాయకత్వంపై తిరిగి విశ్వాసం పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉద్యమ నాయకులకు.. కొత్త ముఖాలకు అవకాశం!**

పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా గ్రామశాఖ, మండల, జిల్లా, రాష్ట్రశాఖల వరకు కూడా కొత్త తరం నాయకులకు, ఉద్యమకాలంలో క్రియాశీలకంగా ఉన్న నాయకులకు ఈ దఫా ప్రాధాన్యం దక్కితే పార్టీకి పూర్వవైభవం ఖాయమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదీగాక కేసీఆర్‌కు వృద్ధాప్యం మీదపడుతున్నందున పార్టీకి ఆయన రాజకీయ వారసుడిగా కేటీఆర్ అనధికారికంగానైనా వ్యవహరిస్తారు. ఈ సమయంలో కేటీఆర్‌కు చేదోడు వాదోడుగా ఉండేలా యువ నాయకులను పార్టీలో కీలక స్థానాల్లో నియమించడం సత్ఫలితాలనిస్తుందని సీనియర్ పాత్రికేయుడు ఒకరు అన్నారు. యువ నాయకత్వం అంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన ఎమ్మెల్యేల నుంచి కాకుండా కొత్తగా గెలిచిన వారు, ఉద్యమ కాలంలో ముందుండి, బీఆరెస్ ప్రభుత్వం వచ్చాక పార్టీతో అంటీముట్టనట్టు మెలుగుతున్నవారిని కూడా క్రియాశీలం చేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన చెప్పారు.

# ఈ నెల 26 తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటన

**మొదటి పేజీ తరువాయి**

ఫలితాలను అందుకోవాలని చూస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా రంగంలోకి దిగబోతున్నట్లు తెలుస్తోంది. కాగా సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పరిపాలన వ్యవహారాల్లో బిజీబిజీగా ఉన్నారు. ఇక జనవరి చివరి వారంలో జిల్లాల పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉంటే అందులో 12 స్థానాలకు తగ్గకుండా గెలవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాల మంత్రులు, నేతలతో కూడా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశాలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలపై నాయకులతో లోతగా చర్చించారు. తన జిల్లాల పర్యటన గురించి కూడా సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. కాగా ఈ నెల 26వ తేదీ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనకు వెళ్లనున్నారని తెలుస్తోంది. మొదటగా ఇంద్రవెల్లిలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. గతంలో పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకోగానే ఇంద్రవెల్లిలో సభ నిర్వహించారు రేవంత్‌రెడ్డి. ఇప్పుడు సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలి సభ ఇంద్రవెల్లిలో నిర్వహించే అవకాశాలు లేకపోలేదు. మొదట ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని కవర్ చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇక ఆ తర్వాత మిగతా జిల్లాల్లో రేవంత్ టూర్‌పై రాష్ట్ర నాయకత్వం చర్చలు జరిపి షెడ్యూల్ ఖరారు చేయనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# కేసీఆర్ అనే మహాశక్తిని ఎదిరించడానికి బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటి అయ్యాయి



హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ అనే మహాశక్తిని ఎదిరించడానికి రాష్ట్రం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటి అయ్యాయి అంటూ కేటీఆర్ ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పార్టీని తెలంగాణలో సంపూర్ణంగా తుడిచిపెట్టేందుకు ఇరు పార్టీలు చేతులు కలిపాయని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సైతం ఇందులో భాగం అయ్యాడంటూ కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ అనే ఒక రాజకీయ పార్టీ కాదు, తెలంగాణ ప్రజల పోరాటానికి ప్రతీక లాంటిది. పది సంవత్సరాలు ఏకపక్షంగా జనాలు మా బీఆర్ఎస్ పార్టీ ని గుండెల్లో పెట్టుకున్నారు. అలాంటి పార్టీని దెబ్బతీసే ప్రయత్నం చెయ్యడం ఎంత మంది చేతులు కలిపినా సాధ్యం కాదు. జనాలు మీరు చెప్పిన మాయ మాటలు, దొంగ హామీలను నమ్మి, ఏదో ఒక్కసారి చూద్దాం మీ పనితనం అని అధికారం లోకి తీసుకొచ్చారు. కానీ అధికారం లోకి వచ్చిన తర్వాత మీ పాలన తీరుని చూసి తరిమికొట్టేటట్టు ఉన్నారు. నా ఇన్నేళ్ల రాజకీయ అనుభవంలో అధికారంలోకి వచ్చిన 40 రోజులకే ఇంత ప్రజా వ్యతిరేకత ప్రభుత్వం పై రావడం ఎప్పుడూ చూడలేదు. రాబొయ్యే ఎంపీ ఎన్నికల్లో జనాలు మీకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు అంటూ కేటీఆర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# బీఆర్ఎస్ కు ఇది పరీక్షా సమయం.. భవిష్యత్ లేదని కుంగిపోవద్దు

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్‌కు విజయాలతో పాటు అపజయాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. గత అపజయాలకు కేసీఆర్ కుంగిపోతే తెలంగాణ వచ్చేదా అని వ్యాఖ్యానించారు. 2009 లో మనకు పది సీట్లే వచ్చాయని ఇక పని అయిపోయిందని కేసీఆర్ ఊరుకుంటే తెలంగాణ వచ్చేదా.. అని ప్రశ్నించారు. ఈ ఓటమి స్పీడ్ బ్రేకర్ మాత్రమే అని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశాల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ లేదని కార్యకర్తలు కుంగిపోవద్దని కార్యకర్తల్లో ధైర్యం నింపారు. భవిష్యత్ లో వచ్చేది మళ్ళీ మనమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ 420 హామీల్లో వాళ్ళు పావలా వంతుకు మించి అమలు చేయలేరని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మల్కాజ్‌గిరిలో పోయిన సారి రేవంత్ తక్కువ ఓట్లతో గెలిచాడని గుర్తు చేశారు. గెలిచిన తర్వాత మల్కాజ్‌గిరి నియోజకవర్గాన్ని రేవంత్ రెడ్డి ఎప్పుడూ పట్టించుకున్న పాపాన పోలేదని.. ఒక్క పైసా నిధులు తీసుకురాలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలో ఈ సారి మనం గెలిచి సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సీట్లను గెలిచామని.. ఇప్పుడు ఎంపీ సీటు కూడా గెలవాలని అన్నారు. ఇది పరీక్షా సమయమని.. మనం పార్లమెంటు ఎన్నికల్లో కచ్చితంగా గెలవాలని వ్యాఖ్యానించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అబద్దాలు ప్రచారం చేసి గతంలో కన్నా ఎక్కువ సీట్లు గెలిచిందని ఆరోపించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు పాలపొంగు లాంటిదేనని అసెంబ్లీ ఎన్నికల్లో నగర ఓటర్లు నిరూపించారని స్పష్టం చేశారు. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల ఫలితాలు కూడా అసెంబ్లీ ఎన్నికల కన్నా భిన్నంగా ఉంటాయన్నారు. కీలకమైన పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఐదేళ్లు అధికారంలో కొనసాగి మళ్లీ అధికారంలోకి రావడం అరుదు అని అన్నారు. రాజస్థాన్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో ఐదేళ్లకే కాంగ్రెస్ అధికారం కోల్పోయిందని గుర్తు చేశారు. కొన్ని చిన్న చిన్న కారణాలతోనే బీఆర్ఎస్ ఓడిపోయిందని హరీశ్‌రావు అన్నారు. కార్యకర్తల సూచనలు పరిగణనలోకి తీసుకుని పార్టీని బలోపేతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని అన్నారు. ఆ రెండు పార్టీల డ్రామాలు ఎండగట్టి పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు ఇప్పట్నుంచే నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

# మృతురాలి కుటుంబానికి 10వేల రూ. ఆర్థిక సహాయం

**అందజేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త కునూరు సాయికుమార్ గౌడ్**





భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 21 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని రామన్నపేట మండలం, బోగారం గ్రామానికి పొట్ట బత్తిని సత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సహృదయంతో స్పందిస్తూ బోగారం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కునూరు సాయికుమార్ గౌడ్ వారి కుటుంబ సభ్యులకు రూ.10000/- రూపాయల ఆర్థిక సహాయం అందజేసి, మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గోగు పద్మ సత్తయ్య యాదవ్, కునూరు నరేష్ గౌడ్ జెల్లా శ్రీనివాస్, ఎండీ. మోహిన్, రచ్చ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి డిజైనర్లు, ఆర్కిటెక్ట్‌లతో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): లండన్ నుంచి బయల్దేరిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదివారం దుబాయ్‌లో బిజీ బిజీగా గడిపారు. ప్రపంచ స్థాయి సిటీ ప్లానర్లు, డిజైనర్లు, మెగా మాస్టర్ ప్లాన్ డెవలపర్లు, ఆర్కిటెక్ట్ లతో సీఎం వరుసగా భేటీ అయ్యారు. హైదరాబాద్ సిటీలో మూసీ రివర్ ఫ్రంట్ డిజైన్లు, అభివృద్ధిపైనే కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. 56 కిలోమీటర్ల పొడవునా మూసీ రివర్ ఫ్రంట్, గ్రీన్ అర్బన్ పార్క్ లు, షాపింగ్ కాంప్లెక్స్ ల నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లు, అభివృద్ధి నమూనాలు, వాటికి అవసరమైన పెట్టుబడులపై వివిధ సంస్థలతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. దుబాయ్ లో దాదాపు 70 సంస్థలతో ఆయన సంప్రదింపులు జరిపారు. ప్రపంచంలో పేరొందిన కంపెనీలు, డిజైన్, ప్లానింగ్, ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు, కన్సల్టెన్సీ నిపుణులతో సమావేశమయ్యారు. దాదాపు అన్ని సంస్థలు తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి, హైదరాబాద్ లో మూసీ రివర్ డెవెలప్మెంట్ ప్రాజెక్టుపై ఆసక్తి ప్రదర్శించాయి. తదుపరి సంప్రదింపులకు త్వరలోనే రాష్ట్రానికి వచ్చేందుకు అంగీకరించాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ చారిత్రాత్మక నగరాలన్నీ నీటి వనరుల చుట్టే అభివృద్ధి చెందాయి. నదులు, సరస్సులు వాటికి సహజత్వాన్ని తెచ్చిపెట్టాయి. మూసీ పునరుద్ధరణతో హైదరాబాద్ సిటీ ప్రపంచంలోనే అద్భుతమైన నగరంగా మారుతుందని అన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మూసీ రివర్ ప్రాజెక్టుకు అపురూపమైన డిజైన్లు, నమూనాలు రూపొందించాలని కోరారు. ఇతర సిటీలు, రాష్ట్రాలతో తాము పోటీ పడటం లేదని, ప్రపంచంలోనే అత్యుత్తమమైన బెంచ్‌మార్క్ నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. దుబాయ్‌లో ఆదివారం వర్కింగ్ డే. ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం అర్ధరాత్రి వరకు ఈ సంప్రదింపులు కొనసాగించనుంది. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు సీఎం హైదరాబాద్ కు చేరుకుంటారు. సీఎంతో పాటు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ వి శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవెలప్ మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, సీఎం స్పెషల్ సెక్రెటరీ బి.అజిత్ రెడ్డి, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ అమ్రపాలితో పాటు అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

# అధికారిక ఆహ్వానం అందలేదు కాబట్టే అయోధ్యకు వెళ్లలేము

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): ఉత్తరప్రదేశ్ లో నిర్మిత మైన అయోధ్య రామ మందిరంలో సోమవారం శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరగనుంది. ఈ క్రమంలో దేశంలోని ప్రముఖులకు, రాజకీయ నాయకులకు, హీరోలకు, క్రికెటర్లకు, అలాగే అన్ని రాజకీయ పార్టీల అధినేతలకు ఆహ్వానం అందించారు. దీనిపై ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పందించారు. దేశంలో ఉన్న ప్రముఖులందరికి కూడా అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం ఆహ్వానం అందింది. కానీ బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ ఫ్యామిలీకి మాత్రం ఎటువంటి ఆహ్వానం అందలేదని తెలిపారు. అధికారిక ఆహ్వానం అందలేదు కాబట్టి అయోధ్యకు వెళ్లలేక పోతున్నామని కవిత తెలిపారు. అలాగే తమకు భవిష్యత్తులో అయోధ్యకు వెళ్లే అవకాశం వస్తుందని అప్పుడు తప్పకుండా వెళతామని రాముడు అందరివాడని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఘాటు వ్యాఖ్యలు

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): 130 ఏళ్ల చరిత్ర అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ఇప్పుడు ఏ స్థితిలో ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ పాలనను ప్రజలు ఎన్నటికి మరువలేరని అన్నారు. చరిత్రను చెప్పుకుని మనుగడ సాధించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఎద్దేవా చేశారు. దేశంలోని మొత్తం 28 రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని రాష్ట్రాల్లో అధికారం ఉందో చెప్పాలన్నారు. ఒకవేళ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ అధికారంలోకి వచ్చి ప్రధాని మోడీ అయితే, కాంగ్రెస్‌కు ముసళ్ల పండగేనని అన్నారు. అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం వచ్చిందా.. అని విలేకరులు ప్రశ్నించగా.. తనకు ఇన్విటేషన్ అందలేదని మల్లారెడ్డి తెలిపారు.

# డా. బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ నుంచి ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఏడాదిలో జనవరి – ఫిబ్రవరి సెషన్ కు సంబంధించిన ప్రకటన వచ్చింది. దూర విద్యా ద్వారా డిగ్రీ, పీజీ, లైబ్రరీ సైన్స్, పీజీ డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్ లైన్ లో దరఖాస్తులను సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. జనవరి 31, 2024 వరకు గడువు విధించారు. www.braouonline.in, www.braou.ac.in వెబ్ సైట్ లోకి వెళ్లి వివరాలను చెక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు ఉన్నాయి. ఇక పీజీలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంబీఏ కోర్సులతో పాటు పీజీ డిప్లొమాలో బీఎల్ఐఎస్సీ (BLISc), ఎంఎల్ఐఎస్సీ (MLISc) సహా పలు సర్టిఫికేట్ కోర్సులను పేర్కొంది. ఇందులో అడ్మిషన్లు పొందేందుకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ .. జనవరి 31,2024 తేదీతో ముగియనుంది. ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలని నోటిఫికేషన్ లో అధికారులు పేర్కొన్నారు. క్రెడిట్/డెబిట్ కార్డు ద్వారా ఏపీ, టీఎస్ ఆన్లైన్ సెంటర్ ల ద్వారా చెల్లించవచ్చు.

# రాష్ట్ర సలహాదారులను ప్రకటించిన ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి**

బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఇక మరో సీనియర్ నేత షబ్బీర్ అలీ కూడా సలహాదారుడిగా నియమితులయ్యారు. ఎమ్మెల్యే కోటాలో ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం దక్కుతుందని అంతా భావించినప్పటికి ఛాన్స్ దక్కలేదు. దీంతో ఆయన్ను సలహాదారునిగా నియమించింది. ఇక మల్లు రవిని ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా నియమించింది ప్రభుత్వం. ప్రోటోకాల్,ప్రజా సంబంధాల ప్రభుత్వ సలహాదారుగా హర్కార వేణుగోపాల్ రావు నియమితులయ్యారు. ఈ నియమకాలు వెంటనే అమల్లోకి వస్తాయని సీఎస్ పేర్కొన్నారు. ఈ నలుగురికి కేబినెట్ హోదాతో కూడిన ప్రొటోకాల్ అమలు కానుంది.